రాజాపేట మండల కేంద్రంలో రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు

సాగునీటి కోసం రోడ్లు ఊడ్చి నిరసన

రాజాపేట, ఫిబ్రవరి 8 : కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా సాగునీరు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో శనివారం రైతు జేఏసీ ఆధ్వర్యంలో రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం రైతు జేఏసీ ఆధ్వర్యంలో గత కొన్నిరోజులుగా నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో రోజూ ఒక వినూత్న కార్యక్రమంతో ఆందోళనలు చేస్తున్నారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు సట్టు తిరుమలేశ్, ఉట్కూరు అశోక్‌గౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, బెడిదే కృష్ణ , చిగుళ్ల బీరయ్య, కుమ్మరి పుల్లయ్య, కుమ్మరి లక్ష్మణ్, బెడిదే వీరేశం, మెండు భగవాన్‌రెడ్డి, బూరుగు శేఖర్‌రెడ్డి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

హస్తకళా నైపుణ్య విద్యపై విద్యార్థులకు అవగాహన

మఠంపల్లి, ఫిబ్రవరి 8: మండలంలోని అల్లీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హస్తకళా నైపుణ్య విద్యపై మండల కేంద్రానికి చెందిన త్రివేణి శనివారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు లూర్దుమారెడ్డి, సైదులు, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 9: సూర్యాపేటలో త్వరలో ప్రారంభం కానున్న జేబీఎం ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు అర్హత కలిగిన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సల్ మొబిలిటీ కంపెనీ ఆపరేషనల్ మేనేజర్ ఆర్.రాజీవ్ ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల హెవీ లైసెన్స్ బ్యాడ్జితో పాటు హెవీ వెహికిల్స్ నడిపిన అనుభవం, పదో తరగతి పూర్తి చేసిన 25 నుంచి 45 ఏండ్ల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు లైసెన్స్ బ్యాడ్జి, ఆధార్ కార్డు, ఫొటోలతో వచ్చి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 8639001701, 73828 35217 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

'నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి'

పాలకవీడు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి నాగిని

నూతనకల్, ఫిబ్రవరి 8: ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని తెలిపారు. 1 నుంచి 6 ఏండ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 సంవత్సరాల వారికి ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవిరెడ్డి వెంకటరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆనంద్ గౌడ్, సీతారాంరెడ్డి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు: నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంత మయ్యేలా చూడాలని మండల వైద్యాధికారి నాగిని సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని మూసీ ఒడ్డు సింగారం ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశ వర్కర్ నసీద, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

'మహాధర్నాను విజయవంతం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 8: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలోఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. శనివారం కోదాడలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు న్యాయం చేయని బడ్జెట్‌కు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మిట్టగనుపుల ముత్యాలు, కుక్కడపు నళిని, దాసరి శ్రీను, గొర్రెముచ్చు మరియన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

నేడు గ్రామోత్సవంతో చెర్వుగట్టు జాతర ముగింపు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 8 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పార్వతీ పరమేశ్వరులను అశ్వ వాహనంపై ఊరేగించారు. అనంతరం మహా మండపం వద్ద 108 కళశాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారికి వైభవంగా పుష్పోత్సవం ఏకాంత సేవలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో గజవాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ నవీన్, ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ తెలిపారు.

ఎడమకాల్వ పరిధిలో ప్రతి ఎకరాకు నీరందేలా చర్యలు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 8: సాగర్ ఎడమ కాల్వ చివరి భూములకు నీరందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం వజీరాబాద్ మేజర్ కాల్వను ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజీరాబాద్ మేజర్ కింద వారబందీ విధానం ద్వారా నీటి విడుదల వల్ల చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారబందీగా కాకుండా నిరంతరాయంగా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. కాల్వలో పేరుకపోయిన చెత్తను తొలగించాలన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి చివరి భూములకు నీరందేలా చూస్తామన్నారు. ఆయన వెంట నాయకులు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీ సెంటర్లను వినియోగించుకోవాలి : ఎంఈఓ



బొత్తలపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ కాటయ్య

పాలకవీడు, ఫిబ్రవరి 8: ప్రీ ప్రైమరీ సెంటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య అన్నారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా మండల పరిధిలోని బొత్తలపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు తమ చిన్నారులను ప్రీ ప్రైమరీ సెంటర్‌కు పంపించాలని ఎంఈఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్యాద సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, మాధవి, సీఆర్పీ మంగ్తానాయక్, అంగన్‌వాడీ టీచర్లు జానకమ్మ,శ్రీలత తదితలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది నిబంధనలను పాటించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, ఫిబ్రవరి 8: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సిబ్బంది విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ఈ నెల 27న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఎవరికీ మినహాయింపు లేదని, అందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ఎన్నికలు పింక్ కలర్ బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 26న ఉదయం 7 గంటలకు సిబ్బంది బ్యాలెట్ పంపిణీ కేంద్రానికి చేరుకోవాలని, 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిబ్బంది 2 గంటలకు ఒకసారి పోలైన ఓట్ల వివరాలు తెలపాలని, 4 గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్లు మూసి అప్పటి వరకు లైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించాలని తెలిపారు. పోలింగ్ ముగిశాక ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లు సీజ్ చేసి తరలించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎలాంటి రాజకీయ పార్టీల ప్రచారాలు చేపట్టరాదని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కోదాడ బాలుర ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష హాల్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 8: నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం కోదాడలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలో 240 మంది విద్యార్థులకు గాను 181 మంది హాజరుకాగా, కేఎస్ఎస్‌బీఎం బాలికల పాఠశాలలో 240 మందికి 182 మంది, సీసీఆర్ విద్యా నిలయంలో 274 మందికి 216 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి ఎండీ. సలీంషరీఫ్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 8: లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పట్టణ పరిధిలోని కొమరబండలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన జి.సుధాకర్ ఏపీలోని ఏలూరుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కోదాడకు వచ్చిన ఆయన సూర్యాపేటకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. కిటికీ పక్కన కూర్చొని సెల్‌ఫోన్ చూస్తుండగా కొమరబండ వద్దకు రాగానే జారి రోడ్డుపై పడింది. విషయాన్ని డ్రైవర్‌కు చెప్పగా బస్సు ఆపాడు. సెల్‌ఫోన్ కోసం సుధాకర్ ఒక్కసారిగా రోడ్డుపైకి రాగా అదే సమయంలో కోదాడ వైపునకు వస్తున్న లారీ ఢీకొట్టడంతో కుడి కాలు నుజ్జు నుజ్జయింది. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

మునగాల, ఫిబ్రవరి 8: హత్యాయత్నం కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత మంగళవారం మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన కాసాని బలరాం, కాసాని ముత్తయ్య, కాసాని వెంకన్న అనే ముగ్గురు పాలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన పనస విజయ్, దొడ్డారపు వెంకటేశ్, మునగలేటి శేఖర్, చిర్ర ప్రదీప్ అనే నలుగురు గ్రామంలోని స్కూల్ వద్ద కాపుకాసి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి : ఎంఈఓ

విద్యార్థినికి పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 8: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓ వెంకటరెడ్డి ఆకాంక్షించారు. శనివారం స్థానిక ఐడియల్ హైస్కూల్లో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నారపరెడ్డి, కరస్పాండెంట్ ఎస్వీ రమణకుమార్, తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా వరుస చోరీలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 8: కోదాడ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతూ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నాలుగు రోజుల క్రితం శ్రీమన్నారాయణ కాలనీలో, శుక్రవారం బాలాజీనగర్, నయానగర్, గోపిరెడ్డినగర్‌తో పాటు మండలంలోని అడ్డూరులో చోరీలకు పాల్పడ్డారు. వరుస దొంగతనాలు జరుగుతున్నా నేరస్తులను పట్టుకోవడంలో పోలీసుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా స్పందించి నేరాలను అదుపులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

జాతరలో దుకాణాల ఏర్పాటుకు నేడు స్థలాల కేటాయింపు

చివ్వెంల, ఫిబ్రవరి 8: పెద్దగట్టు జాతరలో దుకాణాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించేందుకు నేడు రసీదులు ఇవ్వనున్నట్లు వేలంపాట హక్కుదారులు మామిడి కిరణ్, పాల్వాయి లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దురాజ్‌పల్లిలోని వార్డు కార్యాలయంలో రసీదులు పొందాలని తెలిపారు. గతంలో దుకాణాలు నిర్వహించిన వారు నేటి నుంచి 11వ తేదీలోపు సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 95539 98700,95505 52070 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి'

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 8: గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవినాయక్, మల్లం మహేశ్ కోరారు. శనివారం పట్టణంలో సంఘం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కొంతమంది యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పతాని శ్రీను, నాగేశ్వర్ రావు, ఆశీర్వాదం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

11న ఎస్పీ కార్యాలయంలో పాతటైర్లు, బ్యాటరీల వేలం

నీలగిరి, ఫిబ్రవరి 8 : జిల్లా ఎస్పీ కార్యాలయ పరిధిలోని మోటర్ ట్రాన్స్‌పోర్టు విభాగంలోని వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, ఇనుప విడి భాగాలు, బ్యాటరీలను ఈ నెల 11న వేలం వేయనున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు మోటరు ట్రాన్స్‌ఫోర్ట్ ఇన్‌స్పెక్టర్ నూరప్పనాయుడు, సెల్ : 8712670170ను సంప్రదించాలని కోరారు.

10న డిండి ఐటీఐలో అప్రెంటీస్ మేళా

డిండి, ఫిబ్రవరి 8 : మండల కేంద్రం డిండిలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన కంపెనీల్లో అప్రెంటీస్ చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటీస్ యాక్ట్ ప్రకారం స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైనవారు అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ ప్రొఫైల్, సర్టిఫికెట్ల జిరాక్స్ తీసుకొని రావాలని, వివరాలకు సెల్ 91826 63839ను సంప్రదించాలని సూచించారు.

హిందీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 8: మండలంలోని అనాజిపురం ఆదర్శ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోడి లింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హత, అనుభవం కలిగిన వారు ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99896 36205 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కోదాడ రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కాపుగల్లులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

'గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

మోతె, ఫిబ్రవరి 8: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మోతె పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్ సూచించారు. శనివారం రాముని తండాలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలో అనారోగ్యంతో మరణించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిసితి బాగా లేక పోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

తుంగతుర్తి, ఫిబ్రవరి 8: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తండ రాజయ్య ఇటీవల తాటిచెట్టు పైనుంచి జారిపడి మరణించగా, జిల్లా కేంద్రంలోని ఆర్వీ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం రాజయ్య కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ రామ్మూర్తి, చిత్తలూరి యాదగిరి, గుండగాని రాములుగౌడ్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చివ్వెంల, ఫిబ్రవరి 8: కడుపునొప్పికి తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జి.తిరుమలగిరిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగదాల సైదులు (50) రోజు మాదిరిగానే శనివారం పొలానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భార్య భోజనం పెట్టే సమయంలో పురుగుల మందు వాసన రావడంతో ఇరుగుపొరుగు వారికి తెలియజేసింది. వెంటనే సైదులును ఆటోలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్పృహ తప్పి ఉన్న సైదులు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సైదులు కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను నిత్యం పర్యవేక్షించాలి : డీఆర్‌డీఓ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ అప్పారావు

చివ్వెంల, ఫిబ్రవరి 8: అంగన్‌వాడీ కేంద్రాలను మండలాధికారులు నిత్యం పర్యవేక్షించి సేవలపై ఆరాతీయాలని డీఆర్‌డీఓ అప్పారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో అధికారులకు నిర్వహించిన మాన వాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పేదరికానికి గల కారణాలు, సమతుల ఆహారం, చిరుధాన్యాల ఆవశ్యకత, పిల్లల పోషణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ సురేశ్, డీపీఎంలు ఆంజనేయులు, రత్తయ్య, లక్ష్మీనారాయణ, గోవింద, ఏపీఎం సైదయ్య, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 8: నేరేడుచర్లలోని రామాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత నేరేడుచర్ల, రాంపురం, కమలానగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా దద్దనాల చెరువు, మల్లన్న నగర్, టీచర్స్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, సీతారాం నగర్, మిర్యాలగూడ రోడ్డు, సాయిబాబా థియేటర్ రోడ్డు, సుందరయ్య నగర్, రామస్వామిగట్టు, మాధవరాయిని గూడెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు: మండలంలోని బేతవోలు, చిలుకూరు సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం చిలుకూరు, నారాయణపురం, బేతవోలు, జెర్రిపోతులగూడెం, పోలేనిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

'కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్'

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్యం

నాగారం, ఫిబ్రవరి 8: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించే మహాధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పుల్లు సత్యం కోరారు. శనివారం మండల కేంద్రం నాగారంలో నిర్వహించిన సీపీఎం మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. పేద, కార్మిక వర్గాలను నిరాశపరిచిందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు జి.వెంకటేశ్వర్లు, పంది మల్లయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు, దూడ మృతి

విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు,దూడ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 8 : విద్యుదాఘాతంతో ఆవు, దూడ మృతి చెందిన సంఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. అనుముల మండలం యాచారం గ్రామానికి చెందిన చింతల నాగరాజు కొంత కాలంగా మర్రిగూడలో పాలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం తన పాలం వద్ద ఆవులను మేతకు వదిలిపెట్టాడు. ఆవులు గడ్డిమేస్తున్న సందర్భంలో వ్యవసాయ బోరుకు వచ్చే కరెంటు తీగలు తెగి వాటిపై పడ్డాయి. దాంతో ఆవు, దూడ అక్కడిక్కడే మృతి చెందాయి. విద్యుత్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఇటీవలే అప్పు చేసి రూ.1.20 లక్షలు పెట్టి ఆవులను కొనుగోలు చేసినట్లు రైతు నాగరాజు తెలిపారు. ప్రస్తుతం పంటలు సరిగా పండక అందుకు చేసిన అప్పులు తీర్చలేక పోగా.. విద్యుదాఘాతంతో పశువులు మృతి చెందడంతో రైతు బోరున విలపిస్తున్న తీరు తోటి రైతులను కంటతడి పెట్టించింది. రైతు కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మోతె, ఫిబ్రవరి 8: మండలంలోని నామవరం జడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం రాఘవాపురం ఎక్స్ రోడ్డులోని పీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు యాదగిరి, గోవర్ధన్ రెడ్డి, ఖాజా, నర్సిరెడ్డిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మట్టిపల్లి సైదులు, భయ్యా గంగరాజు, కోలా కృష్ణ, కారింగుల వెంకన్న, బర్ల చౌదరి, ఝాన్సీ, జ్యోతి, నళిని, స్వాతి, తహసీన్, రేణుక, రవి, నూర్జహాన్, శైలజ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.